నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | KHAMMAM

మూటలు ఎత్తి.. కూలి పనులు చేసి..

రజతోత్సవ సభ నిధుల సేకరణకు హమాలీగా మారిన 'రేగా'

మణుగూరు టౌన్, ఏప్రిల్ 17 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణ కోసం నిధుల సేకరణకు బీఆర్ఎస్ శ్రేణులు గురువారం మూటలు ఎత్తారు, మార్కెట్‌లో పనులు చేసి తమవంతుగా నిధులు సేకరించారు. మణుగూరు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు వివిధ షాపుల వద్ద బియ్యం బస్తాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు మోసి కూలి పనులు చేశారు. ఆయా దుకాణాల యజమానులు కూలి పనులు చేసినందుకు కొంత మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ తమ పార్టీ సభను పండుగలా జరుపుకోవాలనే ఉద్దేశంతో నిధులు సమకూర్చుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూలి పనులు చేసినట్లు చెప్పారు. ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభలో కేసీఆర్ మాట్లాడే ప్రసంగం వినేందుకు ప్రజలు ఇప్పటి నుంచే ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. సభకు తరలివెళ్లే వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ జిల్లా అధ్యక్షులపై ఉన్నదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీగా సభకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోశం నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, నూకారపు రమేశ్, వట్టం రాంబాబు, అడపా అప్పారావు, ముద్దంగుల కృష్ణ, యూసుఫ్, యాదగిరి గౌడ్, ఎడ్ల శ్రీను, ఆవుల నర్సింహారావు, రవి, జావీద్, సృజన్, రంజిత్, మహిళా కార్యకర్తలు జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో కూలి పనులు చేస్తున్న రేగా కాంతారావు

జీవో 21ని వెనక్కి తీసుకోవాలి

కాంట్రాక్ట్ అధ్యాపకులకు మద్దతుగా విద్యార్థులు, సంఘాల నేతల ధర్నా

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 17: కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళనకు మద్దతుగా నిలిచిన విద్యార్థులు ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో 30 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వం అక్రమంగా తెచ్చిన జీవో 21ని వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ.. సమాజాభివృద్ధిలో కీలకంగా మారిన విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అధ్యాపకులను శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అలాగే పార్ట్‌టైం కాంట్రాక్ట్‌గా అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మందా సురేశ్, మస్తాన్‌లు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించేవరకు కాంట్రాక్ట్ అధ్యాపకులకు విద్యార్థులతోపాటు తాము మద్దతుగా నిలిచి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికైనా జీవో 21ని వెనక్కి తీసుకోవాలని, ఏళ్లతరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, శ్యాంబాబు, కోటి, మధు, శ్రీనివాస్, రాజీవ్, లక్ష్మీహరిత, రమ, విద్యార్థి సంఘాల నాయకులు వెంకటేశ్, సురేశ్, సమైఖ్య, ఠాగూర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

భరోసా కల్పించే చట్టం 'భూ భారతి'

అవగాహన సదస్సులో ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ

మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

కూసుమంచి (నేలకొండపల్లి), ఏప్రిల్ 17: రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూ భారతి అని ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని వాసవీ కల్యాణ మండపంలో భూ భారతి చట్టం అవగాహన సదస్సును అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి గురువారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతుల భూములపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ సమస్యలపై రైతులు మీసేవలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశించిన సమయంలో పరిష్కరిస్తామన్నారు. భూ భారతి పోర్టల్‌లో నమోదైన రికార్డు ఆధారంగానే బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. అనంతరం రైతుల సందేహాలను ఆమె అక్కడికక్కడే నివృత్తి చేశారు. ఈ చట్టం ద్వారా భూములకు సంబంధించి అవినీతిని అరికట్టి రెవెన్యూ శాఖను బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లడానికి పైలట్ స్టడీ కోసం నాలుగు మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అందులో జిల్లా నుంచి నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేశారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నేలకొండపల్లి ఏఎంసీ చైర్మన్ వీ సీతారాములు, డీఏవో ధనసరి పుల్లయ్య, ఆర్డీవో నర్సింహారావు, ఏడీఏ బీ సరిత, తహసీల్దార్లు హుస్సేన్, వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎర్రయ్య, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

27న అన్ని గ్రామాల్లో గులాబీ జెండాలు ఎగురవేయాలి
రజతోత్సవ 'పాలేరు' సన్నాహక సమావేశంలో ఎంపీ వద్దిరాజు
భవిష్యత్ ప్రణాళికపై వరంగల్ సభలో కేసీఆర్ దిశానిర్దేశం: తాతా
కేసీఆర్ వల్లనే తిరుమలాయపాలెం సస్యశ్యామలం: నామా, కందాళ

కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 17 : కేసీఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీళ్లు అందించే సీతారామ ప్రాజెక్టు కూడా గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతేనని స్పష్టం చేశారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రజతోత్సవ సభ విజయవంతం కోసం తిరుమలాయపాలెంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 27న సభకు వెళ్లేముందు అన్ని గ్రామాల్లోనూ బీఆర్ఎస్ దిమ్మె లపై గులాబీ జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సారథ్యంలో పాలేరు నియోజకవర్గం నుంచి పదివేల మంది వరంగల్ సభకు తరలేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక ప్రజలతోనే ఎక్కువ తిట్లు తింటున్న ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చరిత్రకెక్కారని విమర్శించారు. కోర్టుల నుంచి వచ్చిన తీర్పులే కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టుగా నిలిచాయని అన్నారు

వరంగల్ సభలో దిశానిర్దేశం: తాతా మధు

పార్టీ భవిష్యత్ ప్రణాళికలపై వరంగల్ సభలో అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు పేర్కొన్నారు. వరంగల్ సభను విజయవంతం చేసేందుకు వాల్‌పోస్టర్లు, గోడ రాతలు, జెండా పండుగలు చేపట్టాలని, వాటి ద్వారా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. అయితే, జిల్లాలో ముగ్గురు మంత్రులున్నప్పటికీ ఏ ఒక్కరూ ప్రజల్లో కన్పించడం లేదని, జిల్లా అభివృద్ధిని వదిలేసి కమీషన్ల వసూళ్లపై దృష్టిపెట్టారని విమర్శించారు. కృష్ణార్జునుల్లా హరీష్‌రావు, కేటీఆర్‌లు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతున్నట్లు చెప్పారు. రాబోయే రోజులు మనవేనని, మన పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.

కేసీఆర్ వల్లనే తిరుమలాయపాలెం సస్యశ్యామలం: నామా, కందాళ

గత బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ చూపిన చొరవ వల్లనే తిరుమలాయపాలెం మండలం సస్యశ్యామలమైందని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుమునుపు కరువుపీడిత మండలంగా ఉన్న తిరుమలాయపాలేన్ని కేసీఆర్ అభివృద్ధి చేసి చూపించారని గుర్తుచేశారు. అయితే, నాటి కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం చెందుతున్న వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే పనిచేస్తోందని; బీఆర్ఎస్ నాయకులైన ఇంటూరి శేఖర్, బాషబోయిన వీరన్నలతోపాటు మరికొందరిపై అక్రమ కేసులు పెట్టించిందని ఆరోపించారు. చట్టాన్ని విస్మరించి తమ పార్టీ నేతలపై తప్పుడు కేసులు పెడితే పోలీసులూ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు. తరువాత మండలంలోని జల్లేపల్లి నుంచి బీఆర్ఎస్‌లో చేరిన అన్నెపర్తి ఉపేందర్, బోళ్ల సుధాకర్‌లకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ తిరుమలరావు సహా బీఆర్ఎస్ నాయకులు బాషబోయిన వీరన్న, బెల్లం వేణు, వేముల వీరయ్య, ఉన్నం బ్రహ్మయ్య, చావా వేణు, కొండబాల వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ నామా, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ మాజీ చైర్మన్ తదితరులు

సభకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 17: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ షావలి, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు మాట్లాడుతూ జీవో నంబర్ 60 ప్రకారం గ్రామపంచాయతీ వర్కర్లకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీపీవో ఆఫీసులో వినతిపత్రాన్ని అందించారు. సంఘం నాయకులు నూపా భాస్కర్, మల్లెల వెంకటేశ్వర్లు, వేముల గురునాథం, వేల్పుల రమేశ్, మల్సూర్, గుగులోత్ లక్ష్మణ్, నీలం భాస్కర్, బానోత్ ధనవంతురావు, సుమన్, రాంచంద్, మంచ్యా, రాజయ్య, రాము, సేవ్యా, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

అందాల పోటీలు వద్దే వద్దు..

- మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో ర్యాలీ, ధర్నా

ఖమ్మం, ఏప్రిల్ 17: హైదరాబాద్ వేదికగా వచ్చే నెలలో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీలను వ్యతిరేకిస్తూ వామపక్ష మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం లో గురువారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి జానకి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పీవైఎల్ జిల్లా నాయకుడు రవీందర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీర్, ఏఐవైఎఫ్ నాయకుడు శ్రవణ్‌లు మాట్లాడారు. కమర్షియల్ మార్కెటింగ్ కోసం అందాల పోటీలను రాష్ట్రంలో నిర్వహించడం అంటే తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. అందాల పోటీల వల్ల మహిళలకు ఎలాంటి ఉపయోగం లేదని, ప్రభుత్వం అందుకు రూ.250 కోట్లు ఖర్చు చేయడం అర్థరహితమన్నారు. తక్షణమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా, విద్యార్థి సంఘాల నాయకులు

తడిసిన మొక్కజొన్న

నేలవాలిన వరి

'కూలిన' అన్నదాతల ఆశలు

- అకాల వర్షానికి కుదేలైన 'భద్రాద్రి' కర్షకులు
- ఈదురుగాలులకు భారీగా దెబ్బతిన్న పంటలు
- పెట్టుబడి కూడా రాదంటూ అన్నదాత దిగాలు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ వేడుకోలు
- 470 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం

భద్రాద్రి జిల్లాలో గత 10 రోజుల వ్యవధిలో కురిసిన అకాల వర్షాలు, వీచిన ఈదురుగాలులకు అన్నదాతల ఆశలు నేలకూలాయి. చేతికి అందిన పంటలు దెబ్బ తినడంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోయారు. పెట్టుబడి కూడా రాదంటూ దిగులు చెందుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలంటూ వేడుకుంటున్నారు. ఈ నెల 16 వరకు జిల్లావ్యాప్తంగా 470 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. సుమారు 313 మంది ఉద్యాన రైతులు నష్టపోయారు. అయితే, వ్యవసాయ పంటల నష్టం వివరాలు అందించడానికి జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూరావు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

–అశ్వారావుపేట, ఏప్రిల్ 17

చండ్రుగొండలో నేలమట్టమైన మొక్కజొన్న

ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలు చేతికి అందే సమయంలో వచ్చిన అకాల వర్షం రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. సరైన ధరలు లేక ఏటా నష్టపోతున్న రైతులకు ప్రకృతి విపత్తులు కూడా మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి. వర్షాకాలంలో అధిక వర్షాలు భారీగానే దెబ్బతీస్తున్నాయి. ఎండాకాలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులు మరింత నష్టాన్ని మిగల్చుతున్నాయి. అన్ని రకాల పంటలకూ భారీగానే నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మామిడి, మొక్కజొన్న, వరి, అరటి, కూరగాయలు, మునగ, జీడి మామిడి తోటలు నేలమట్టమయ్యాయి.

విరిగిన మునగ చెట్లు

అప్పుల ఊబిలోకి..

అకాల వర్షాలతో పంటలు దెబ్బతింటుండడంతో పెట్టుబడులు రాక, అప్పులు పెరిగి రుణాల ఊబిలో కూరుకుపోతున్నారు అన్నదాతలు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 'రైతు భరోసా' కూడా అందించకపోవడంతో ఆర్థికంగా మరింత కుదేలవుతున్నారు. పంటల బీమాను ప్రభుత్వం అమలుచేయకపోవడంతో మరింత కుంగిపోతున్నాడు. మద్దతు ధర, పంటల బీమా వంటివి అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడంతో అన్నదాతలకు నష్టాల తీవ్రత మరింతగా పెరుగుతోంది. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో పంటలు ఆశలు కూడా వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. విత్తనం నాటిన దగ్గర నుంచి మొదలుకొని కంకి చేతికి వచ్చే వరకూ పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నా.. ప్రకృతి విపత్తులు మాత్రం ఒక్కరోజుతో ఆరుగాలం శ్రమను తుడిచిపెడుతున్నాయి.

జిల్లాలో 470 ఎకరాల్లో పంటల నష్టం..

జిల్లాలో ఈ నెల 7 నుంచి మొదలైన అకాల వర్షాల కారణంగా దెబ్బతింటున్న పంటల వివరాలను ఉద్యానవన శాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఈ నెల 16 నాటికి 470 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఇందులో సుమారు 313 మంది రైతులు నష్టపోయినట్లు నిర్ధారించారు. దెబ్బతిన్న పంటల్లో 284 మంది రైతులకు చెందిన 425 ఎకరాల మామిడి, 18 మంది రైతులకు చెందిన 34 ఎకరాల అరటి, 10 మంది రైతులకు చెందిన 10 ఎకరాల కూరగాయలు ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. పంట నష్టం సర్వే ఇంకా కొనసాగుతూనే ఉందని అధికారులు చెబుతున్నారు. సర్వే పూర్తయిన తర్వాత నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామంటున్నారు. ఇదిలా ఉంటే వ్యవసాయ శాఖ నుంచి పంట నష్టం అంచనా వివరాలు అందించేందుకు జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు అందుబాటులోకి రాలేదు. పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

అకాల వర్షాలు, ఈదురుగాలులతో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట చేతికందే సమయంలో వాతావరణ మార్పుల వల్ల కురిసిన వర్షాలకు దిగుబడిని కోల్పోయాను. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే అప్పుల ఊబిలో నుంచి బయటపడే పరిస్థితి లేదు.

–ఎస్‌కే బాజీ, రైతు, దమ్మపేట

ఆర్థికంగా నష్టపోయా..

తోటల పెంపకం కోసం వెచ్చించిన పెట్టుబడి అకాల వర్షాలకు ఆవిరైపోయింది. దెబ్బతిన్న పంటతో ఆర్థికంగా నష్టపోయాను. అప్పుల ఊబిలో నుంచి ఎలా బయటపడాలో తెలియడం లేదు. పంట చేతికి అందలేదు. ఆందోళన తప్ప ఏమీ కన్పించడం లేదు.

–నర్సారెడ్డి, రైతు, అన్నపురెడ్డిపల్లి

వరి పంట నేలమట్టమైంది..

ఈదురుగాలులకు వరి పంట మొత్తం నేలమట్టమైంది. మరికొన్ని రోజుల్లో వరి కోతకు సిద్ధమయ్యాను. సరిగ్గా అదే సమయంలో అకాల వర్షం కురవడంతో పంట నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం లేకుంటే అప్పుల్లోంచి బయటపడలేను.

–సీహెచ్.సోమరాజు, రైతు, అన్నపురెడ్డిపల్లి

పంట నష్టం సర్వే కొనసాగుతోంది..

భద్రాద్రి జిల్లాలోని అన్ని మండలాల్లో ఉద్యాన పంటల నష్టం సర్వే కొనసాగుతోంది. ఈ నెల 7 నుంచి 16 నాటికి 313 మంది రైతులకు చెందిన 470 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించాం. పంట సర్వే పూర్తయిన తర్వాత నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం.

– జంగా కిశోర్, జిల్లా ఉద్యానాధికారి, భద్రాద్రి

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

పథకాల అమలులో సర్కారు విఫలం: సీపీఎం

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 17: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లితండా గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కన్నోతు ధర్మా మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని, ఆరు గ్యారెంటీలు అంటూ ప్రజలను నట్టేట ముంచిందని ఆరోపించారు. రాష్ట్రంలోని 25 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కావాల్సి ఉండగా.. ఇంతవరకు వాటి ఊసే లేదన్నారు. కొత్త రేషన్ కార్డులపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాట్రాల తిరుపతిరావు, బానోత్ కుమారి, జ్యోతిరాం, కొమరారెడ్డి, బానోత్ మోతి, కున్సోత్ సునీల్, దరావత్ వీరు, బానోత్ కిషన్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సరిహద్దు గ్రామాల్లో ఎస్పీ పర్యటన

మోటార్ సైకిల్‌పై తిరుగుతూ రోడ్డు పనుల పరిశీలన

దండకారణ్యంలో బలగాలకు సూచనలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

చర్ల, ఏప్రిల్ 17: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులను భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు మోటారు సైకిల్‌పై తిరుగుతూ గురువారం పరిశీలించారు. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు దండకారణ్యంలో పర్యటించిన ఆయన చర్ల మండలం పూసుగుప్ప నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు రాంపురం గ్రామాల మధ్య రూ.2.9 కోట్ల వ్యయంతో చేపట్టిన 1.9 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. సరిహద్దు గ్రామాల్లో నిర్మిస్తున్న రోడ్డు వల్ల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాంపురం, భీమవరంపాడు గ్రామాల ఆదివాసీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్పీ అన్నారు. ఆదివాసీ గిరిజనులకు విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు పోలీసు శాఖ ద్వారా చేపట్టిన పనులను ఆయన మీడియాకు వివరించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ విక్రమ్‌కుమార్ సింగ్, సీఐ రాజువర్మ ఉన్నారు.